92వ అధ్యాయం

## ٩٢ - بَابُ الْوَقَارِ وَالسَّكِينَةِ

## ప్రశాంతత, హుందాతనం

قال الله تعالى: ﴿ وَعِبَادُ الرَّحْمَٰنِ الَّذِينَ يَمْشُونَ عَلَى الْأَرْضِ هَوْنًا وَإِذَا خَاطَبَهُمُ الْجَاهِلُونَ قَالُوا سَلَامًا﴾ [الفرقان: ٦٣].

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు:

"కరుణామయుని (అసలు) దాసులు ఎవరంటే, వారు నేలపై వినమ్రులై నడుస్తారు, మూర్ఖులు వారిని పలకరించినప్పుడు 'మీకో సలామ్' అని చెప్పి అక్కణ్ణుంచి వెళ్ళి పోతారు." *(అల్ ఫుర్ఖాన్ : 63)*

**వివరణ :**

నేలపై నిక్కుతూ నడవటమనేది మూర్ఖత్వానికి నిదర్శనం. దీనికి భిన్నంగా అణకువతో వినయవినమ్రతలు ఉట్టిపడేలా నడవటం హుందాతనానికి తార్కాణం. అదేవిధంగా మూర్ఖులతో వాదులాటకు దిగటం కూడా హుందాతనానికి విరుద్ధమే. విశ్వాసులైన దాసులు తమకు ఎప్పుడైనా మూర్ఖులు తారసిల్లితే ఉత్తమోత్తమ రీతిలో అక్కణ్ణుంచి తప్పించుకోవటానికి ప్రయత్నిస్తారు.

٧٠٣ - عن عائشةَ رضي الله عنها قالتْ: مَا رَأَيْتُ رسولَ اللهِ ﷺ مُسْتَجْمِعاً قَطُّ ضَاحِكاً حَتَّى تُرَى مِنْه لَهَوَاتُه، إِنَّمَا كانَ يَتَبَسَّمُ. متفقٌ عليه. «اللَّهَوَات» جَمْع لَهَاةٍ: وَهِيَ اللَّحْمَة الَّتِي فِي أَقْصَى سَقْفِ الْفَمِ.

703. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లం) తన గొంతుక తిత్తులు కనబడేవిధంగా విరగబడి నవ్వటం నేనెన్నడూ చూడలేదు. ఆయన కేవలం చిరునవ్వు చిందించేవారు. *(బుఖారీ - ముస్లిం)*

లహవాత్ అనేది 'లహాతున్' అనే పదానికి బహువచనం. గొంతుకలో నోటి చివర పైభాగంలో ఉండే మాంసపు తిత్తిని లహాతున్ అని అంటారు.

**ముఖ్యాంశాలు**

విపరీతమైన నవ్వు మనిషిని దేవుని విషయంలో ఏమరుపాటుకు గురి చేస్తుంది. అందుకే దివ్య ఖుర్‌ఆన్‌లో ఒకచోట, "వారు నవ్వటం తగ్గించాలి, ఏడ్వటం హెచ్చించాలి" అని చెప్ప బడింది. అదీగాక బిగ్గరగా, పగలబడి నవ్వటం మూలంగా మనిషి తన గాంభీర్యాన్ని, హుందా తనాన్ని కోల్పోతాడు. సౌమ్యులు, పరువుప్రతిష్ఠలు కలిగివున్న వారెవరూ పగలబడి నవ్వరు. వారి పెదవులపై ఎల్లప్పుడూ చిరునవ్వే తొణికిసలాడుతూ ఉంటుంది.